క్లుప్తంగా

21 నుంచి ఆధార్ స్పెషల్ క్యాంపులు

వెంకటాచలం: ఎస్టీల కోసం ఈ నెల 21 నుంచి 26 తేదీ వరకు మండలంలోని పలు గ్రామాల్లో ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కల్పన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చాలామంది ఎస్టీలకు ఆధార్ లేకపోవడంతో ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని, వారి కోసం ఈ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. 21న చెముడుగుంట, కాకుటూరు గ్రామాలకు కలిపి చెముడుగుంట సచివాలయంలో, 22న అనికేపల్లి, కంటేపల్లి గ్రామాలకు గొలగమూడి సచివాలయంలో, సర్వేపల్లి, తిక్కవరప్పాడు గ్రామాలకు సర్వేపల్లి సచివాలయంలో, 23న నిడిగుంటపాళెం, ఇస్కపాళెం, తాటిపర్తిపాళెం, పంజులూరుపాడు గ్రామాలకు నిడిగుంటపాళెం సచివాలయంలో, 24న కసుమూరు, కందలపాడు, పాలిచెర్లపాడు, కురిచెర్లపాడు గ్రామాలకు కసుమూరు సచివాలయంలో, గుడ్లూరువారిపాళెం, తిరుమలమ్మపాళెం, పూడిపర్తి, ఎగువమిట్ట గ్రామాలకు గుడ్లూరువారిపాళెం సచివాలయంలో, 25న ఇడిమేపల్లి, ఈదగాలి గ్రామాలకు ఇడిమేపల్లి సచివాలయంలో, 26న వెంకటాచలం, చవటపాళెం గ్రామాలకు వెంకటాచలం సచివాలయంలో, కనుపూరు గ్రామ పరిధిలోని ఎస్టీలకు కనుపూరు సచివాలయంలో క్యాంపులు నిర్వహిస్తామని, ఆధార్ కార్డులు లేనివారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలి

పొదలకూరు: మండలంలోని ప్రతి పంచాయతీలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించాలని ఎంపీడీఓ డీవీ నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాల్సిందిగా సూచించారు. కార్యక్రమాన్ని ఫొటోలు తీసి వాట్సాప్‌లో అప్‌లోడ్ చేయాల్సిందిగా పేర్కొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని ఆశ్రమ పాఠశాలలో 2025 – 26 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని నిర్వాహకుడు ప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలబాలికలకు ప్రత్యేకంగా హాస్టల్ వసతి ఉందన్నారు. జిల్లాకు చెందిన వారే అర్హులని వివరించారు. వినికిడి లోపం ఉంటే పాఠశాల బదిలీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీతో పాఠశాలను సంప్రదించాలని కోరారు. వివరాలకు 99893 46709, 92486 51399 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ నేతలతో సమావేశం



కోవూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోవూరు నియోజకవర్గ మహిళా సమన్వయ కమిటీ సభ్యులతో సమావేశాన్ని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నెల్లూరులోని తన నివాసంలో శుక్రవారం నిర్వహించారు. పార్టీ బలోపేతానికి ఎలాంటి చర్యలు చేపట్టాలో తెలియజేశారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు, ఏపీఎల్‌ఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, పార్టీ రైతు విభాగ జిల్లా అధ్యక్షుడు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, చెర్లో సతీష్‌రెడ్డి, షాహుల్, అత్తిపల్లి అనూప్‌రెడ్డి, శివుని నరసింహారెడ్డి, శేషగిరి, నేతలు కోడూరు వెంకటసుబ్బారెడ్డి, కలువ బాలశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ గోదాము వద్ద అవగాహన



పొదలకూరు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని గ్యాస్ గోదాము, పెట్రోల్ బంకు వద్ద అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఎఫ్‌ఓ విజయ వరకుమార్ పర్యవేక్షణలో సిబ్బంది డెమో ఇచ్చారు. ప్రమాదం జరిగిన సమయంలో మంటలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక ఉద్యోగులు, గ్యాస్ గోదాము, పెట్రోల్ బంకు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆధార్ స్పెషల్ డ్రైవ్

మనుబోలు: ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను ఎస్టీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జలజాక్షి కోరారు. మనుబోలు మండల కేంద్రంలో శుక్రవారం మనుబోలు, కొమ్మలపూడి, చెరుకుమూడి, ముద్దుమూడి, కాగితాలపూరు, గురివిందపూడి గ్రామాలకు చెందిన ఎస్టీల కోసం ఆధార్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధార్ నమోదు, సవరణల కోసం ఎస్టీలు ఇబ్బందులు పడకూడదని ఐటీడీఏ అన్ని మండలాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



మాట్లాడుతున్న శ్యామ్‌సన్‌కుమార్



శిలువ మోస్తున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు(బృందావనం): గుడ్ ఫ్రైడేను పురస్కరించుకొని నగరంలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు.

- ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని లోన్ స్టార్ బాప్టిస్ట్ చర్చిలో నిర్వహించిన మూడు ఆరాధనల్లో శిలువపై యేసుక్రీస్తు పలికిన సప్తవాక్యాలను ధ్యానించారు.
- వీఆర్సీ సమీపంలోని బాప్టిస్ట్ చర్చి డానీహాల్లో సప్తవాక్కులపై కార్యదర్శి గుర్రం అరుణ్‌కుమార్ నేతృత్వంలో సంఘ కాపరి రెవరెండ్ శ్యామ్‌సన్‌కుమార్, గంటా జార్జిస్టీవెన్సన్, రెవరెండ్ ప్రభాకర్‌రావు, మార్గరెట్, జొహాన్నా, విలియమ్స్ శుభకర్, రెవరెండ్ డేవిడ్ లివింగ్‌స్టన్ ప్రసంగించారు. కంచర్ల సత్యక్రిస్టఫర్ రచించిన పాటను ఒక్కో ప్రసంగానికి అనువుగా ఆలపించారు. చైర్మన్ సురేంద్రబాబు, కోశాధికారి విజయభాస్కర్, డికన్స్ పాల్గొన్నారు.
- అలంకార్ సెంటర్ సమీపంలోని హెబ్రోన్ ప్రేయర్ హౌస్‌లో ఆరాధనలను సంఘ కాపరి రెవరెండ్ డాక్టర్ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.
- మూలాపేటలోని రామిరెడ్డిపేటలో గల తెలుగు సెకండ్ బాప్టిస్ట్ చర్చిలో సంఘ కాపరి శామ్యూల్ కిశోర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ సురేంద్రబాబు, కార్యదర్శి కుమార్ పాల్గొన్నారు.
- బట్వాడిపాళెంలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో రెవరెండ్ హరిపాల్, సెక్రటరీ పాల్సన్ పాల్గొన్నారు.
- నీలగిరి సంఘంలోని హెబ్రోన్ అసెంబ్లీస్ చర్చిలో రెవరెండ్ డాక్టర్ డేవిడ్ దయాసాగర్, సుహాసిని పాల్గొన్నారు.
- పొదలకూరు రోడ్డులోని యునైటెడ్ క్రిస్టియన్ చర్చిలో ఆరాధనలను రెవరెండ్, షారోన్ అధ్యక్షతన జరిపారు.
- నేతాజీనగర్‌లోని యునైటెడ్ గుడ్ న్యూస్ బాప్టిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలను సంఘ కాపరి రెవరెండ్ డాక్టర్ రాజశేఖర్ దాసరి.. వేదాయపాళెంలోని ఆల్మా చర్చిలో రెవరెండ్ రూఫస్ కమలాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.
- సంతపేటలోని రోమన్ క్యాథలిక్ క్యాథెడ్రల్‌లో బిషప్ ప్రకాశం ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. శిలువను మోస్తూ కపాడిపాళెం, సంతపేట తదితర ప్రాంతాల్లో ఊరేగింపును నిర్వహించారు. యేసుక్రీస్తు ప్రతిమలకు మొక్కుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.
- ఫతేఖాన్‌పేటలోని సెయింట్ ఆంథోనీ చర్చిలో శిలువ ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రన్ ఫర్ జీసస్ నేడు

యేసుక్రీస్తు పునరుత్థానాలను చాటుతూ నగరంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నామని నిర్వాహకులు రెవరెండ్ డేవిడ్ దయాసాగర్, బ్రదర్ జానిజో తెలిపారు. ఏబీఎం కాంపౌండ్ నుంచి ఉదయం ఆరుకు ప్రారంభమై బట్వాడిపాళెం సెంటర్ వరకు కొనసాగనుందని చెప్పారు.

నెల్లూరు సిటీ: చింతారెడ్డిపాళెంలోని ఆర్సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. ఈ సందర్భంగా శిలువను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి మోశారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రార్థనలు



క్యాండిళ్లను వెలిగిస్తున్న భక్తులు

మల్లేశ్వరుడికి పంచహారతుల బహూకరణ



నెల్లూరు(బృందావనం): నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో కొలువైన స్వామివార్ల సేవల కోసం తిరిచ్చి, పంచహారతులు, త్రిశూలాన్ని శుక్రవారం బహూకరించారు. వీటిని ఈఓ మల్లికార్జునరెడ్డికి దాతలు ముత్యాల రాజేష్, కిరణ్మయి దంపతులు ఇచ్చారు. ప్రధానార్చకుడు కార్తికేయశర్మ, నాగరాజారెడ్డి, ముకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ నగరోత్సవం



నెల్లూరు(బృందావనం): నవాబుపేటలోని యనమలపాళెంలో నిర్వహిస్తున్న పోలేరమ్మ జాతరలో భాగంగా పోలేరమ్మ గ్రామోత్సవాన్ని వేడుకగా జరిపారు. యనమలపాళెం, పుల్లమ్మసత్రం, మేకలవారితోట, మైపాడు గేట్ సెంటర్ మీదుగా నగరోత్సవం సాగింది. ప్రత్యేక వాహనంపై విశేషాలంకారంలో కొలువైన పోలేరమ్మ, పోతురాజు విగ్రహాలను మైపాడు తీరానికి తరలించి నిమజ్జనం చేశారు.

అప్సా నూతన కమిటీ ఎన్నిక



నెల్లూరు(వీఆర్సీసెంటర్): మినీబైపాస్‌లోని యాంపుల్ చిల్డ్రన్స్ అకాడమీలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) జిల్లా నూతన కమిటీ ఎన్నికలను శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా కృష్ణ, ఉపాధ్యక్షులుగా అమీర్‌జాన్, జక్రియా, జనరల్ సెక్రటరీగా శ్రీలక్ష్మి, ట్రెజరర్‌గా నారాయణనాయుడు, ఈసీ మెంబర్‌గా శ్రీనివాసులు ఎన్నికయ్యారు. నెల్లూరు సిటీ, రూరల్, కోవూరు, ఉదయగిరి నియోజకవర్గాలకు నూతన కమిటీలను ఏర్పాటు చేశారు.

పాఠశాలల బలోపేతానికి సహకరించరూ..



కోటంరెడ్డికి వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు సిటీ: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించాలని యూటీఎఫ్ నేతలు కోరారు. ఈ మేరకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని నగరంలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు శేషు, చలపతి, అచ్చయ్య, కోశాధికారి మురళీధర్‌రావు, ఖాజావలీ తదితరులు పాల్గొన్నారు.

‘నిధులను భారీగా దోచుకున్నారు’

నెల్లూరు రూరల్: పేదలందరికీ ఇల్లులో కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.రెండు వేల కోట్లను అధికారులు దోచుకున్నారని బీజేపీ నేత మిడతల రమేష్ ఆరోపించారు. ఈ మేరకు కలెక్టరేట్లోని మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రాన్ని శుక్రవారం ఆయన అందజేశారు. నేతలు యాకసిరి ఫణిరాజు, ప్రసాద్, సునీల్‌రెడ్డి, రత్నంనాయుడు, గిరికుమార్‌గౌడ్, సుబ్బారావు, రాములు, సుజన, పద్మావతి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి కమిషనర్‌గా నందన్



నెల్లూరు(బారకాసు): అదనపు కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న నందన్‌ను ఇన్‌చార్జి కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం శుక్రవారం జారీ చేసింది. కమిషనర్‌గా ఉన్న సూర్యతేజ బదిలీ అయ్యారు. ఈ క్రమంలో రెగ్యులర్ కమిషనర్‌ను నియమించేంత వరకు ఇన్‌చార్జిగా నందన్ వ్యవహరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వివిధ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇస్కాన్ సిటీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఇస్కాన్ సిటీ, గోమతినగర్, శ్రీహరినగర్, రామలింగాపురం, సర్వేపల్లి కాలువకట్ట, ముత్యాలపాళెం, అరవిందనగర్ ఎక్స్‌టెన్షన్ ఏరియా తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

- ఏకేనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని సీఎంనగర్‌లో గల ఒకటో వీధి నుంచి 13వ వీధి వరకు, సావిత్రినగర్, రిత్విక్ ఎన్‌క్లేవ్, గాయత్రినగర్‌లోని మొదటి మూడు వీధులు తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదని వివరించారు.

జీర్ణోద్ధరణ పనుల పరిశీలన



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో చేపట్టిన జీర్ణోద్ధరణ, పునర్నిర్మాణ తదితర అభివృద్ధి పనులను ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి, స్థపతి శుక్రవారం పరిశీలించారు. అమ్మవారికి రాహుకాల పూజలను నిర్వహించారు. వేదపారాయణం, సంధ్యామేళాన్ని సాయంత్రం జరిపారు. కుంభహారతులు, పల్లకిసేవను నిర్వహించారు.

రెడ్‌క్రాస్‌లో రక్తదానం

నెల్లూరు(అర్బన్): రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ మాజీ వైస్ చైర్మన్ దామిశెట్టి సుధీర్‌నాయుడు 60వసారి రక్తదానం చేశారు. తన జన్మదినాన్ని పురస్కరించుకొని మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్సీ మెంబర్ దాసరి రాజేంద్రప్రసాద్, అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శిబిరం రేపు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్ సమీపంలోని సాయిదర్బార్ అద్దాల మందిరంలో రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించనున్నామని మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి తెలిపారు. సాయిదర్బార్ యువ సేవాదళ్ సభ్యుడు సాయినాథ్‌రెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించనున్నామని, రక్తదాతలు 95028 49784. 98663 38933 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నియమితులైన మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్‌ను నగరంలోని ఆయన నివాసంలో పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ నేతలు మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. కార్పొరేటర్లు బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, సత్తార్, జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు, బీసీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శ్యామ్ సింగ్, జిల్లా మహిళాధ్యక్షురాలు లక్ష్మీసునంద, నేతలు కనకట్ల మోహన్‌రావు ముదిరాజ్, అబ్దుల్ రజాక్, ప్రదీప్‌రెడ్డి, మల్లికార్జున, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): పద్మశాలీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ పద్మశాలి ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ పేర్కొన్నారు. నగరంలోని లస్సీ సెంటర్‌లో గల ఆ శాఖ కార్యాలయంలో పలువురితో శుక్రవారం ఆయన చర్చించారు. అఖిల భారత పద్మశాలి సంఘ జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మేయర్ సీసీకి గాయాలు

నెల్లూరు సిటీ: రోడ్డు ప్రమాదంలో మేయర్ సీసీ సిద్ధిఖ్ గాయపడ్డారు. వివరాలు.. పొట్టేపాళెం నుంచి నెల్లూరుకు తన బుల్లెట్‌పై వస్తుండగా, ఎదురుగా మరో బైక్ ఢీకొనడంతో కిందపడ్డారు. దీంతో తల, చేతులకు గాయాలయ్యాయి. మరో బైక్ నడుపుతున్న వ్యక్తి స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రుడ్ని 108లో కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. సీసీని మేయర్ స్రవంతి దంపతులు పరామర్శించారు.

త్వరితగతిన పార్కుల అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న నారాయణ

నెల్లూరు సిటీ: నగరపాలక సంస్థ పరిధిలోని పార్కుల అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నగరంలోని నారాయణ మెడికల్ కళాశాలలో గల తన క్యాంప్ కార్యాలయంలో ఇన్‌చార్జి కమిషనర్ నందన్‌తో కలిసి సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం టీడీపీ నగర, వార్డు అధ్యక్షులతో సమావేశమైన ఆయన మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. నిత్యం ఎనిమిది గంటల పాటు డివిజన్లలో పర్యటించాలని సూచించారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, సిటీ ఇన్‌చార్జి మామిడాల మధు తదితరులు పాల్గొన్నారు.

- రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను ఆయన క్యాంప్ కార్యాలయంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, ఇన్‌చార్జి కమిషనర్ నందన్ మర్యాదపూర్వకంగా కలిశారు. వివిధ అంశాలపై చర్చించారు.

పాటలు, డ్యాన్స్ పోటీలు రేపు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నామని ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను నర్తకి సెంటర్‌లో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పాటలు, డ్యాన్స్ పోటీలు, సిద్ధేంద్ర యోగి కూచిపూడి కళాక్షేత్ర విద్యార్థులతో సంప్రదాయ నృత్యాలు, సంగీత విభావరి తదితరాలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. రచయితల సంఘ జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్, రమణయ్య, అమానుల్లాఖాన్, రఘురామిరెడ్డి, మహేష్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో డీసీఓ తనిఖీలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): సంగం ప్రాథమిక వ్యవసాయ సహకార సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంకును డీసీఓ గుర్రప్ప శుక్రవారం తనిఖీ చేశారు. షెల్టర్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని, పెట్రోల్, డీజిల్ విక్రయాలకు సంబంధించిన వివరాలను కంప్యూటర్ ద్వారా నమోదు చేయాలని ఆదేశించారు. పరిసరాల్లో మొక్కలు నాటడంతో పాటు లైటింగ్ ఏర్పాట్లు బాగా ఉండేలా చూడాలని సూచించారు.

పోలీసుల స్పెషల్ డ్రైవ్

- డ్రంక్ అండ్ డ్రైవ్‌పై 27 కేసులు నమోదు
- కత్తితో పట్టుబడిన యువకుడి అరెస్ట్
- మరో నిందితుడి కోసం గాలింపు

నెల్లూరు(క్రైమ్): నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్‌ను పోలీస్ అధికారులు గురువారం రాత్రి నుంచి అర్ధరాత్రి వరకు నిర్వహించారు. ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారి ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, శివారు ప్రాంతాల్లో వాహన తనిఖీలను చేపట్టారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా లేని 15 వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై 75 కేసులు నమోదు చేసి రూ.68,420 అపరాధ రుసుమును విధించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 27 మందిపై కేసులు నమోదు చేశారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న పలువుర్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ సౌజన్య మాట్లాడారు. నేరాలను నియంత్రించి ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలను అందించాలనే ఇన్‌చార్జి ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు తనిఖీలను నిర్వహించామన్నారు.



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్

కత్తితో పట్టుబడిన యువకుడు

గాంధీబొమ్మ సెంటర్ వద్ద వాహన తనిఖీలను చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్సై అయ్యప్ప చేపట్టారు. స్కూటీపై వస్తూ పోలీసులను చూసి ఇద్దరు వ్యక్తులు పరారవుతుండగా ఎస్సై వారిని వెంబడించారు. ఓ వ్యక్తి పరారవ్వగా, నాయబ్‌ను పట్టుకున్నారు. స్కూటీని తనిఖీ చేయగా, అందులో కత్తి ఉండటంతో దాన్ని స్వాధీనం చేసుకొని నాయబ్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించారు.

నగదును దోచుకునేందుకే..

బుచ్చిరెడ్డిపాళెంలోని ఖాజానగర్‌కు చెందిన నాయబ్ ఐటీఐ వరకు చదువుకున్నారు. సీఆర్పీ డొంకలో ఏడేళ్లుగా ఉంటూ ఓ ప్రైవేట్ లైఫ్ ఇన్సురెన్స్ కంపెనీలో కలెక్షన్ ఏజెంట్‌గా పనిచేస్తూ మద్యానికి బానిసయ్యారు. ఈ క్రమంలో బాలాజీనగర్‌కు చెందిన దేవాతో పరిచయమై స్నేహితులయ్యారు. సంపాదన మొత్తం తాగేందుకే వెచ్చించసాగారు. దీనికి సరిపడా నగదు లేకపోవడంతో రోడ్లపై వెళ్లేవారిని కత్తితో బెదిరించి నగదు దోచుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే స్కూటీపై గురువారం వస్తుండగా, గాంధీబొమ్మ వద్ద పోలీసులను చూసి పరారయ్యేందుకు యత్నించారు. దేవా తప్పించుకోగా, పోలీసులకు నాయబ్ చిక్కారు. దీంతో ఆయన్ను శుక్రవారం అరెస్ట్ చేశామని, పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ చెప్పారు.